
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం। 15 । ఆగస్టు । 2023



ఏజెన్సీలో అప్రమత్తం

ఆగస్టు 15న బ్లాక్‌డే పాటించాలని మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. IIలో



.. నేడు సీనియర్లకు రాయితీ

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 60 ఏళ్లు పైబడిన వారికి నేడు ఆర్టీసీ ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. IIలో

గరిష్టం/కనిష్టం 34°/24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం



స్వామివారి విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్‌ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. మేళతాళాలు, వేద మంత్రాలతో స్వామివారిని ఊరేగింపుగా హోమశాలకు తీసుకొచ్చారు. అక్కడ మండపారాధన, గణపతిపూజ అనంతరం రుద్ర హోమం, చివరకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ మహిపతి రామలింగం, సభ్యులు వెంగళరావు, వెంకటరామారావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కేటీపీఎస్‌ సీఈలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఈలు

పాల్వంచ : కలెక్టర్‌ ప్రియాంక ఆలను కేటీపీఎస్‌ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌ రావు, 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు సోమవారం ఐడీఓసీలో మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీపీఎస్‌లో విద్యుదుత్పత్తి తీరు ఎలా ఉందని కలెక్టర్‌ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈటీ ఎస్‌ఎన్‌ఎస్‌.శేఖర్‌, ఏడీఈ వై.వెంకటేశ్వర్లు, డి.వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫొటో ప్రదర్శన



భద్రాచలంటౌన్‌: దేశ స్వాతంత్య్రానికి ముందు నాటి ఫొటోలను భద్రాచలం హెడ్‌ పోస్టాఫీస్‌లో సోమవారం ప్రదర్శించారు. అనంతరం స్వాతంత్య్రం రాకముందు జన్మించిన తాళ్లూరి పంచాక్షరయ్య, తిప్పన సిద్దులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోస్ట్‌ మాస్టర్‌ ప్రసాదరెడ్డి, సామంతు, సుధీర్‌, దుర్గా ప్రసాద్‌, ఆనంద్‌, గోపాల్‌, ఈశ్వర్‌ పాల్గొన్నారు.

17న జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌ ఎంపికలు

కొత్తగూడెంటౌన్‌: జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 17న పాల్వంచ శ్రీనివాసకాలనీ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్‌ జనరల్‌ సెక్రటరీ కె.మహీధర్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మిడిల్‌ అండ్‌ లాంగ్‌ డిస్టెన్స్‌ అథ్లెటిక్స్‌ ట్రయల్స్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ఎంపికలు 14, 16, 18, 20 ఏళ్ల లోపు బాలబాలికలకు, 600, 800, 1500, 5000 మీటర్ల పరుగు పందెంలో పోటీలు ఉంటాయని వివరించారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారిని హైదరాబాద్‌ గోల్కొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు కోచ్‌ నాగేందర్‌ను సంప్రదించాలని సూచించారు.


విదేశీ విద్యకు సాయం

కొత్తగూడెంరూరల్‌ : 2023 – 24 విద్యాసంవత్సరంలో విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించడానికి వెళుతున్న ఎస్సీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్‌ ఓవర్సీస్‌ విద్యా నిధి ద్వారా ఆర్థిక సాయం అందజేస్తుందని షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ అధికారి డి.అనసూర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యూఎస్‌ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్‌, యూకే, సింగపూర్‌, జపాన్‌, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు పీజీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలకు మించని వారు మాత్రమే ఆర్థిక సాయానికి అర్హులని తెలిపారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, 35 ఏళ్ల లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసి, సంబంధిత కాపీలను తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గాంధీభవన్‌ వేదికగా..

ఇల్లెందు కాంగ్రెస్‌ టికెట్‌ కోసం పోటాపోటీ..

- పార్టీలో పెరిగిన ఆశావహుల జాబితా
- రాష్ట్ర కార్యాలయంలో జోరుగా ప్రయత్నాలు
- కమ్యూనిస్టుల కంచుకోటలో మారిన పరిస్థితులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: హస్తం గుర్తుపై ఇల్లెందు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్న ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు మరో రెండు నెలల సమయమే ఉండటంతో కాంగ్రెస్‌ నేతలు జోరు పెంచారు. డీసీసీ మొదలు ఏఐసీసీ వరకు ఎవరికి వీలైన పద్ధతుల్లో వారు టికెట్ల కోసం లాబీయింగ్‌ ముమ్మరం చేశారు.

గాంధీ భవన్‌లో ఇల్లెందు చర్చ..

ఇల్లెందుకు చెందిన నేతలతో కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర కార్యాలయం కిక్కిరిసిపోతోందని గాంధీ భవన్‌ వర్గాలు అంటున్నాయి. జనరల్‌ స్థానం నుంచి కూడా ఇంత పోటీ లేదని వారే చర్చించుకుంటున్నారు. ఇల్లెందులో కాంగ్రెస్‌ పార్టీ ఇంత బలంగా ఉందా అని రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇల్లెందు నుంచి కాంగ్రెస్‌ టికెట్‌ ఆశిస్తున్న నేతలు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌కు క్రమం తప్పకుండా వెళుతున్నారు. పార్టీ పెద్దలు వచ్చే వరకూ అక్కడే మకాం వేస్తున్నారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలు ఒకరి తర్వాత ఒకరిని కలుస్తూ తమ యోగ్యతలను వివరిస్తున్నారు. టికెట్‌ ఇప్పించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు. గడిచిన రెండు నెలలుగా ఇలాంటి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో గాంధీ భవన్‌కు వచ్చే నాయకుల్లో సగం మంది ఇల్లెందుకు చెందిన వారే ఉంటున్నారనడంలో అతిశయోక్తి లేదు. ఇల్లెందులో కాంగ్రెస్‌ క్రేజ్‌ చూసి ఆ పార్టీ వర్గాలు విస్తుబోతున్నాయి.

'హస్తం'పై ఆశావహుల చూపు..

ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీకి గట్టి ఓటు బ్యాంకు ఉండటంతో ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇప్పటివరకు గాంధీభవన్‌కు చేరిన దరఖాస్తుల్లో.. జిల్లా పరిషత్‌ చైర్మన్‌, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు చీమల వెంకటేశ్వర్లు, డాక్టర్‌ రామచంద్రునాయక్‌, భూక్యా దళ్‌సింగ్‌, డాక్టర్‌ జి.రవి, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్‌ కుమారుడు సాయిశంకర్‌ నాయక్‌, మాజీ ఐఏఎస్‌ అధికారి డీఎస్‌ రావు, సంజయ్‌నాయక్‌, మంగీలాల్‌నాయక్‌, లక్ష్మణ్‌నాయక్‌, వెంకట ప్రవీణ్‌ నాయక్‌, బానోతు విజయలక్ష్మి తదితరుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరంతా టికెట్‌ సాధించేందుకు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తమకు గాడ్‌ఫాదర్లుగా ఉన్న వారి ద్వారా టికెట్‌ కోసం పైరవీలు మొదలెట్టారు. ఇంకొందరు నేతలు మరో అడుగు ముందుకేసి ఢిల్లీ కేంద్రంగా ఏఐసీసీ పెద్దల కరుణాకటాక్షం పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

రెండుసార్లు కాంగ్రెస్‌..

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2009లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో మహాకూటమి తరఫున టీడీపీ అభ్యర్థి ఊకె అబ్బయ్య విజయం సాధించారు. కాంగ్రెస్‌ అభ్యర్థి రెండో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఊపందుకోవడంతో తెలంగాణలో టీడీపీ గణనీయంగా నష్టపోయింది. 2014లో జరిగిన ఎన్నికల్లో తొలిసారి హస్తం గుర్తుపై కోరం కనకయ్య, 2018లో హరిప్రియ నాయక్‌ గెలుపొందారు.

కమ్యూనిస్టు టు కాంగ్రెస్‌

నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇల్లెందు కమ్యూనిస్టు పార్టీలకు కంచుకోటగా ఉంటూ వచ్చింది. పీడీఎఫ్‌ మొదలు సీపీఐ, సీపీఐ (ఎంఎల్‌) పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇక్కడ అప్రతిహతంగా విజయాలు సాధిస్తూ వచ్చారు. సీపీఐ(ఎంఎల్‌) ప్రజాపంథా నేత గుమ్మడి నర్సయ్య ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. కానీ 2009 సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో పరిస్థితులు తారుమారయ్యాయి. అప్పటి వరకు ఇల్లెందు పరిధిలో ఉన్న కారేపల్లి మండలం వైరా నియోజకవర్గంలో చేరగా, గుండాల మండలం పినపాక నియోజకవర్గ పరిధిలోకి వెళ్లింది. మరోవైపు రద్దయిన సుజాతనగర్‌ నియోజకవర్గంలో భాగంగా ఉన్న కామేపల్లి మండలం ఇల్లెందు పరిధిలోకి వచ్చింది. మాజీమంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి సొంత మండలం కావడంతో ముందు నుంచీ ఇక్కడ కాంగ్రెస్‌కు సంప్రదాయ ఓటు బ్యాంకు పుష్కలంగా ఉండేది. దీంతో ఇల్లెందులో ఒక్కసారిగా కాంగ్రెస్‌ పార్టీ బలం పుంజుకుంది.

ప్రతిపాదనల్లోనే 'డయాలసిస్‌'



పాల్వంచలోని కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌

- పాల్వంచలో కేంద్రం ఏర్పాటుకు ఎదురుచూపులు
- బాధితులకు తప్పని వ్యయప్రయాసలు
- సేవలందించేందుకు అనువుగా కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌
- ప్రధానంగా కొత్తగూడెం ఆస్పత్రిపై ఒత్తిడి తగ్గే అవకాశం

పాల్వంచ: జిల్లాలో డయాలసిస్‌ సేవలు విస్తరించకపోవడంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు, మణుగూరు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో మాత్రమే డయాలసిస్‌ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో రోజుకు 50 మంది వరకు బాధితులు వెయిటింగ్‌ లిస్ట్‌లో ఉంటున్నట్లు అంచనా. కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, ఏన్కూరు, సుజాతనగర్‌, జూలూరుపాడు, పాల్వంచ, ములకలపల్లి మండలాల రోగులు అత్యధికంగా అక్కడికి వెళ్లాల్సివస్తోంది. ఇక ఏజెన్సీలోని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి సైతం రోగులు అత్యధికంగా వస్తున్నారు. దీంతో రెండు ఆస్పత్రుల్లో ఉండే లోడ్‌ను తగ్గించడంతోపాటు, జనాభా ఎక్కువ ఉన్న పాల్వంచ పట్టణంలో డయాలసిస్‌ సేవలు అందబాటులోకి తేవాలని గతంలో అనేక సార్లు ప్రతిపాదనలు చేశారు. కానీ ప్రభుత్వం మంజూరు చేయకపోవడతో బాధితులకు వ్యయప్రయాసలు తప్పడంలేదు.


ఆరు నెలల క్రితమే గదుల కేటాయింపు

పాల్వంచ పట్టణంలో సుమారు 80 వేల జనాభా ఉంది. జిల్లా కేంద్రంతో అనుసంధానమై ఉండటంతోపాటు కేటీపీఎస్‌ వంటి భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ డయాలసిస్‌ సేవలు అత్యవసరంగా గుర్తించారు. తద్వారా పాల్వంచ పట్టణం, మండలంలోపాటు ములకలపల్లి మండలం, బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర తదితర ప్రాంతాల బాధితులకు కూడా సేవలు అందుతాయి. ఆస్పత్రి పరిసరాలు, సౌకర్యాలు ఉపయోగించుకుని పాల్వంచలో డయాలసిస్‌ కేంద్రం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇందుకోసం ఆరు నెలల క్రితమే పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో రెండు గదులు కేటాయించారు. అందులో పరికరాలు ఏర్పాటు చేసుకునేలా కొన్ని వసతులు కూడా ఏర్పాటు చేశారు. కానీ సెంటర్‌ మంజూరు కాక పోవడంతో ఓ గదిని జనరల్‌ వార్డుగా, మరో గదిని సమావేశ మందిరంగా వినియోగించుకుంటున్నారు.

అవస్థ పడుతున్న బాధితులు

డయాలసిస్‌ సెంటర్‌ అందుబాటులో లేకపోవడంతో బాధతులు కొత్తగూడెం, భద్రాచలం ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో రవాణా చార్జీలు కూడా భారమవుతున్నాయి. కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌గా ఉన్న పాల్వంచలో డయాలసిస్‌ సేవలు అందుబాటులోకి తేవాలని పలువురు డిమాండ్‌ చేస్తున్నారు. ఐదు బెడ్లు ఏర్పాటు చేస్తే కనీసం రోజుకు 50 మంది రోగులకు చికిత్స అందించే అవకాశం ఉంటుంది. డయాలసిస్‌ నిర్వహణను ఎన్‌జీఓలు చేపడుతుంటాయి. దీంతో ఇక్కడ పనిచేసే సిబ్బందికి సైతం ఎలాంటి పనిభారం పడే అవకాశం ఉండదు.

ఇప్పటికే ప్రతిపాదనలు చేశాం



పాల్వంచ కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌లో సైతం డయాలసిస్‌ సెంటర్‌ అవసరం ఉందని పలుమార్లు ప్రతిపాదనలు చేశాం. ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లాం. పాల్వంచ పట్టణ కేంద్రం కావడంతో బాధితులు సైతం అధికంగానే ఉన్నారు. వారంతా కొత్తగూడెం ఆస్పత్రికి రావడం వల్ల ఇక్కడ లోడ్‌ పడుతుంది. ఐదు బెడ్లు ఇస్తే సరిపోతుంది.

–డాక్టర్‌ రవిబాబు, డీసీహెచ్‌ఎస్‌

ఏఎన్‌ఎం కూతురుకు డాక్టర్‌ పట్టా



పట్టా అందుకుంటున్న అపూర్వ

అశ్వాపురం: మండలంలోని మొండికుంట ఏఎన్‌ఎం లలితకుమారి కుమార్తె డి.అపూర్వ డాక్టర్‌ పట్టా పొందింది. ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌లో ఆదివారం అపూర్వ పట్టా పొందగా, లలితకుమారి సోమవారం వివరాలు వెల్లడించారు. వాజేడు మండలం ధర్మవరానికి చెందిన అపూర్వ 2017లో నీట్‌లో ఉత్తమ ర్యాంక్‌ సాధించి ఆదిలాబాద్‌లో ఎంబీబీఎస్‌ పూర్తి చేసింది. కుమార్తెను డాక్టర్‌ చేయాలనే పట్టుదలతో కష్టపడి చదివించామని ఈ సందర్భంగా లలితకుమారి తెలిపారు.

పారిశుద్ధ్య పనులు నిరంతరం సాగాలి

డీపీఓ లక్ష్మీ రమాకాంత్‌

జూలూరుపాడు: పారిశుద్ధ్య పనులు నిరంతరాయంగా కొనసాగాలని డీపీఓ లక్ష్మీ రమాకాంత్‌ అన్నారు. సోమవారం ఆయన వెంగన్నపాలెంలో డంపింగ్‌ యార్డుతో పాటు ప్రధాన వీధులను పరిశీలించారు. ఎక్కడా చెత్త కనిపించొద్దని, రహదారి, వీధులు శుభ్రంగా ఉంచాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరాం, సర్పంచ్‌ గలిగె సావిత్రి, జీపీ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

పీఆర్‌ ఏఈగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావును అభినందిస్తున్న సిబ్బంది

చుంచుపల్లి: పంచాయతీరాజ్‌ శాఖ కొత్తగూడెం డివిజన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌గా ఎస్‌.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన హైదరాబాద్‌ టీఎస్‌ఎంఐడీసీ విభాగం నుంచి బదిలీపై వచ్చారు. గతంలో అశ్వారావుపేట పంచాయతీరాజ్‌ సబ్‌డివిజన్‌లో డిప్యూటీ ఇంజనీర్‌గా విధులు నిర్వహించారు. కొత్తగూడెం ఈఈ కె.సుధాకర్‌ గత మే నెలలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందారు. దీంతో కొన్ని రోజుల పాటు ఎస్‌ఈ సుదర్శన్‌రావు పర్యవేక్షించారు. ఆయన తరువాత మంగ్యానాయక్‌ ఈఈగా కొనసాగారు. ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు సిబ్బంది కోటయ్య, వేణుగోపాల్‌, సత్యనారాయణ, రామకృష్ణ, ఆంజనేయులు, మధు, వీరభద్రం, అమృత, శివలాల్‌, నాగేందర్‌, జయరాజ్‌ అభినందనలు తెలిపారు.

సమ సమాజ స్థాపనే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రజాపంథా నాయకురాలు రమ

ఇల్లెందు: దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలకు వ్యతిరేకంగా, సమ సమాజ స్థాపనకు సాగే పోరాటాల్లో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని సీపీఐ(ఎంఎల్‌) ప్రజాపంథా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.రమ పిలుపునిచ్చారు. ఇల్లెందులో జరుగుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్‌ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. పాలకులు ఓట్లు, సీట్ల కోసమే వెంపర్లాడుతున్నారని, పేదల కష్టాలంటే వారికి లెక్కే లేదని విమర్శించారు. ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలను తిప్పికొట్టాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అవుల అశోక్‌కుమార్‌ మాట్లాడుతూ అమరుల స్ఫూర్తితో సమసమాజ స్థాపనకు ప్రగతిశీల విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనివర్సిటీల కో ఆర్డినేషన్‌ జాతీయ కన్వీనర్‌ ఎస్‌.నాగేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి. రామకృష్ణ, ఎన్‌.ఆజాద్‌, ఉపాధ్యక్షులు పృథ్వీ, కె.సంధ్య, నరేందర్‌, భాస్కర్‌, ఎస్‌ అనిల్‌, స్వాతి, సాయి, వెంకటేష్‌, నరేష్‌, సుమంత్‌, హలీంపాషా, తిరుపతి, దీపిక, పవిత్ర, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ ప్రియాంక ఆల

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లను కలెక్టర్‌ డాక్టర్‌ ప్రియాంక ఆల సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాటాడ్లుతూ విద్యార్థులు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఆయా శాఖల పరంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉదయం 11 గంటలకు ముఖ్య అతిథి రేగా కాంతారావు జాతీయ పతాకాన్ని అవిష్కరించి, అభివృద్ధి, సంక్షేమంపై ప్రసంగిస్తారని తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసపత్రాలు అందజేస్తామని వివరించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో ప్రగతి మైదానానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, ఎఎస్పీ విజయ్‌కుమార్‌, ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ సంజీవరావు, డీఎంహెచ్‌ఓ శిరీష, మహిళా, బీసీ సంక్షేమాధికారులు సబిత, ఇందిర, ఆర్డీఓ శిరీష, తహసీల్దార్‌ పుల్లయ్య, ఏఓ గన్యా పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలపై ఆగ్రహం

చుంచుపల్లి: విద్యానగర్‌ గ్రామపంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై కలెక్టర్‌ ప్రియాంక ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యానగర్‌ చింతలచెరువు ఆయకట్టుకు పక్కన నిర్మిస్తున్న ఓ భవన సముదాయాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ భవనానికి సంబంధించి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగా కోర్టు ఆదేశాలు బేఖాతర్‌ చేస్తూ నిర్మిస్తున్నారంటూ బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కలెక్టర్‌ భవనాన్ని పరిశీలించారు. పై అంతస్తులో నిర్మిస్తున్న భాగాన్ని తొలగించాలని ఆదేశించారు. నిర్మాణ పనులు ఆపేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, సంబంధిత శాఖల అనుమతి లేకుండా భవనాలు నిర్మించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కేసుల నమోదుకు సైతం వెనకాడబోమని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్‌, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శి బాబురావు పాల్గొన్నారు.

నిలిచిన 'గాంధీ' ప్రదర్శన

కొత్తగూడెంఅర్బన్‌: స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం నుంచి ఈనెల 24 వరకు జిల్లాలోని సినిమా థియేటర్లలో జాతిపిత మహాత్మాగాంధీ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించాలని కలెక్టర్‌ ప్రియాంక ఆల ఆదివారం ఆదేశించారు. ఏమైందో కానీ సోమవారం మాత్రం జిల్లాలో ఎక్కడా సినిమాను ప్రదర్శించలేదు. ప్రభుత్వం నుంచి సినిమాకు సంబంధించి విద్యాశాఖకు జీఓ మాత్రమే వచ్చిందని, కానీ అందులో యాక్షన్‌ ప్లాన్‌పై ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. జిల్లాలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏ ఊరి వారికి అక్కడి థియేటర్లలోనే సినిమా చూపించాల్సి ఉండగా, ప్రదర్శించకపోవడంతో వారంతా నిరుత్సాహానికి లోనయ్యారు. కాగా, 14వ తేదీ సినిమా ప్రదర్శనకు సంబంధించి సినిమా హాళ్ల యాజమాన్యాలకు, ఆర్డీఓ, తహసీల్దార్లకు, పోలీసులకు, జిల్లా విద్యాశాఖ కో–ఆర్డినేటర్లకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. మరి అన్ని శాఖల సమన్వయంతో 16వ తేదీ నుంచి అయినా సినిమా ప్రదర్శన ఉంటుందా లేదా అనేది వేచి చూడాలి. గతేడాది జిల్లాలో 70కి పైగా ఉన్న సినిమా థియేటర్లలో 10 వేల మందికి పైగా విద్యార్థులు గాంధీ సినిమాను వీక్షించి స్ఫూర్తి పొందారు.

పలువురు తహసీల్దార్ల బదిలీలు


సూపర్‌బజార్‌(కొత్తగూడెం): జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్‌ డాక్టర్‌ ప్రియాంక ఆల సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుజాతనగర్‌ తహసీల్దార్‌ రమాదేవిని అశ్వాపురానికి, కరకగూడెం తహసీల్దార్‌ డి.తిరుమలాచారిని కలెక్టరేట్‌ డి–సూపరింటెండెంట్‌గా, కలెక్టరేట్‌ ఇ–సూపరింటెండెంట్‌ వి.రాఘవరెడ్డిని మణుగూరు తహసీల్దార్‌గా, చుంచుపల్లి తహసీల్దార్‌ సీహెచ్‌. నాగరాజును పాల్వంచకు, దుమ్ముగూడెం తహసీల్దార్‌ జి. శిరీషను సుజాతనగర్‌కు, మణుగూరు తహసీల్దార్‌ టి.శ్రీని వాస్‌ను భద్రాచలానికి, అక్కడి తహసీల్దార్‌ వి.కృష్ణప్రసాద్‌ను అశ్వారావుపేటకు, భద్రాచలం నాయబ్‌ తహసీల్దార్‌(ఎలక్షన్‌)ఎస్‌. శ్రీనివాస్‌ యాదవ్‌ను భద్రాచలం ఆర్డీఓ కార్యాలయ డివిజనల్‌ అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌గా, మణుగూరు నాయబ్‌ తహసీల్దార్‌(ఎలక్షన్‌) కె.నాగరాజును కలెక్టరేట్‌ ఇ– సెక్షన్‌ సూపరింటెండెంట్‌గా బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌.శ్వేతను చుంచుపల్లి తహసీల్దార్‌గా, కృష్ణ పానెంను కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ డివిజనల్‌ అడ్మినిస్ట్రేషన్‌ ఆఫీ సర్‌గా నియమించారు. జిల్లాలో పనిచేస్తున్న కె.రాజారావును బూర్గంపాడు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కరీంనగర్‌ జిల్లాలో పనిచేస్తున్న పి.చంద్రశేఖర్‌ను కరకగూడెం తహసీల్దార్‌గా, కె. రవికుమార్‌ను దుమ్ముగూడెం తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని కలెక్టర్‌ తెలిపారు.

జిల్లాలో 'పర్యావరణ' డైరెక్టర్‌ పర్యటన



ఇల్లెందు: మొక్క నాటుతున్న డైరెక్టర్‌ తరుణ్‌

ఇల్లెందు/సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధి ఇల్లెందు ఏరియాలో పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ (హైదరాబాద్‌) డైరెక్టర్‌ కత్తుల తరుణ్‌ సోమవారం పర్యటించారు. ఈ ప్రాంతంలో జేకేఓసీ ఏర్పాటు చేస్తుండగా అనమతులు రావాల్సి ఉంది. ఈ నేపథ్యాన డైరెక్టర్‌ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. తొలుత ఆఫీసర్స్‌ క్లబ్‌లో అధికారులతో సమావేశమైన ఆయన ఓసీ ప్రతిపాదిత ప్రాంతంలో పరిశీలించారు. అలాగే, మూసివేసిన 21 ఇంక్లైన్‌ గనిని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. ఆ తర్వాత కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 షాఫ్ట్‌, వీకే–7 షాఫ్ట్‌ గనులను ఏరియా రెమిడేషన్‌, నేచురల్‌ కమ్యూనిటీ రిసోర్స్‌ అగ్మెంటేషన్‌ ప్లాన్‌లో భాగంగా డైరెక్టర్‌ తరుణ్‌ పరిశీలించారు. అనంతరం రెమిడేషన్‌ పక్రియపై ఆయన సంతృప్తి వ్యక్తం చేయగా, ప్రాజెక్టులకు సంబంధించిన నివేదికలను ఏరియా అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా జనరల్‌ మేనేజర్‌ ఎం.శాలేంరాజు, పీవీకే–5 ఇంక్లైన్‌ మేనేజర్‌ పాలడుగు శ్రీనివాస్‌, టి.సత్యనారాయణ, ఎస్వోటు జీఎం మల్లారపు మల్లయ్య పాల్గొన్నారు.



స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు

కొత్తగూడెంటౌన్: స్వాతంత్య్ర వేడుకలకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం జిల్లా యంత్రాంగం ప్రభుత్వ కార్యాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రగతి మైదానంలో నిర్వహించనున్న 77వ స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 గంటలకు తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. కోర్టు, వన్‌టౌన్, టూటౌన్, డీఎస్పీ, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్లలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు ఆర్టీసీలో సీనియర్ సిటిజన్లకు రాయితీ

చుంచుపల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్ల (60 ఏళ్ల పైబడినవారు) కు ఆర్టీసీ ప్రత్యేక రాయితీలను ప్రకటించిందని కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తిరిగే పల్లెవెలుగు సర్వీసుల్లో వెళ్లే సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరలో 50 శాతం రాయితీ ఇస్తున్నామని, ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం రోజు మాత్రమే ఈ రాయితీ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించి రాయితీ పొందాలని పేర్కొన్నారు.

ఏజెన్సీలో అప్రమత్తం

మావోయిస్టుల బ్లాక్‌డే పిలుపుతో మోహరించిన బలగాలు



చర్ల: ఆగస్టు 15న పూర్తి స్వాతంత్య్రం రాలేదని, ఆ రోజున స్వాతంత్య్ర దినోత్సవానికి బదులు బ్లాక్‌డే పాటించాలంటూ మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఏజెన్సీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సీఐ బి. రాజగోపాల్ నేతృత్వంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. మండలంలోని శివారు గ్రామాలు, సరిహద్దు ప్రాంతంలోని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రత్యేక పోలీసు బలగాలు తనిఖీలు ముమ్మ రం చేశాయి. అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. బ్లాక్‌డేకు పిలుపునిచ్చిన మావో యిస్టులు ఏజెన్సీ గ్రామాల్లో స్వాతంత్య్ర దిన వేడుకలకు విఘాతం కలిగించకుండా పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. సరిహద్దు ప్రాంతానికి సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ బలగాలను పెద్ద సంఖ్యలో తరలించారు. గతంలోనూ బ్లాక్‌డేకు పిలుపునిచ్చిన మావోయిస్టులు పలు శివారు గ్రామా ల్లో నల్ల జెండాలను ఎగురవేసిన నేపథ్యంలో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గాను ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలున్న ప్రాంతాల్లో పెద్దఎత్తున తనిఖీలు నిర్వహిస్తున్నారు. అటవీప్రాంతంలో ఉన్న ఎర్రంపాడు, చెన్నాపురం, బత్తినపల్లి, బట్టిగూడెం, రామచంద్రాపురం, గోరుకొండ, తిప్పాపురం, పూసుగుప్ప, ఉంజుపల్లి, వద్దిపేట, కొండెవాయి, పులిగుండాల, కూకట్ పాడు, బూరుగుపాడు, బక్కచింతలపాడు తదితర గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తికి ఏడాది జైలు

కొత్తగూడెంటౌన్: ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జి.భానుమతి తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి.. 23-02-2017న కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి 108 సిబ్బంది లక్ష్మీదేవిపల్లి సంజయ్‌నగర్‌కు చెందిన బుర్రా విజయ్‌ని ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో కూలీలైన్‌కు చెందిన పోతే వీరస్వామి వాచ్‌మెన్ డ్యూటీలో ఉన్నాడు. అతడి ఎడమచేతికి బలమైన గాయాలై ఉన్నాయి. ఈ క్రమంలో అతడికి చికిత్స అందించేందుకు ప్రయత్నిస్తున్న స్టాఫ్ నర్సు కె.పద్మావతిని బుర్రా విజయ్ అసభ్యంగా తిడుతూ ఆమెపై దాడికి యత్నించాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ అడ్డుకున్నాడు. ఇద్దరినీ చంపుతానని బెదిరిస్తూ అసభ్యంగా తిడుతూ ఉండటతోపాటు చికిత్స చేయనీయకుండా చేశాడు. దీంతో వారు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగి కె.పద్మావతి, వాచ్‌మెన్ వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఏడుగురు సాక్షులను విచారించిన జడ్జి బుర్రా విజయ్‌ను దోషిగా నిర్ధారించి ఏడాది జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కోర్టు లైజర్ ఆఫీసర్ వీరబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రవి సహకరించారు.

బీసీ రుణాల పంపిణీలో గలాట

అశ్వారావుపేటరూరల్: స్థానిక గిరిజన భవన్‌లో బీసీ రుణాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చెక్కులు అందించగా.. కార్యక్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. చెక్కుల పంపిణీ అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ స్థానిక ఎమ్మెల్యేను ఆశీర్వాదించాలని కోరారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.పాషా అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. ప్రభుత్వ కార్యక్రమంలో ఎన్నికల ప్రచారం ఏంటని ప్రశ్నించారు. దీంతో కొద్ది సేపు అధికార పార్టీ నాయకులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

సీసీ కెమెరాలు పెట్టుకోవాలి



మాట్లాడుతున్న సీఐ ఎ.పి. కుమార్

కొత్తగూడెంరూరల్: పోలీస్ స్టేషన్‌లో సివిల్ పంచాయితీలు చేయమని, ప్రతి ఇంట్లో సీసీ కెమెరాలు పెట్టుకోవాలని సీఐ ఏపీ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో సివిల్ తగాదాలు పోలీస్ స్టేషన్‌లో పరిష్కరించడం కుదరదని స్పష్టం చేశారు. ఇంటింటికీ సీసీ కెమెరాలు పెట్టుకోవాలని, దీంతో చోరీ జరిగితే నిందితులను వెంటనే గుర్తించవచ్చని చెప్పారు. ఈ మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో అక్రమంగా ఇసుక, గంజాయి రవాణా చేసేవారితోపాటు వారికి సహకరించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య వస్తే నేరుగా పోలీసులను కలవాలని, మధ్య దళారులను ఆశ్రయించొద్దని సూచించారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తామని వివరించారు. సమావేశంలో ఎస్‌ఐ సంతోష్, సోమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ నగర్‌లో చోరీ

మణుగూరురూరల్: మండలంలోని రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన కాకాటి ఏలేందర్ వ్యక్తిగత పనులపై ఇంటికి తాళం వేసి ఆదివారం ఇల్లెందు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి నగదు, బంగారు ఆభరణాలను అపహరించారు. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి ఇరుగుపొరుగు వారు ఏలేందర్‌కు ఫోన్ ద్వారా సమాచారం తెలిపారు. వెంటనే ఇంటికి చేరుకున్న ఏలేందర్ తన ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించాడు. ఇంట్లో సామగ్రిని చిందవందర చేసి రూ.లక్ష నగదు, తులం బంగారుచైన్, చెవుల దిద్దులు, ఉంగరాలను చోరీ చేసినట్లు బాధితుడు మణుగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



వెంకటేశ్ మృతదేహం

పాల్వంచరూరల్: పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడం లేదని భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కార్తీక్ కథనం ప్రకారం.. సోములగూడెం గ్రామానికి చెందిన ముదిగొండ వెంకటేశ్ (24)కు మధిరకు చెందిన శిరీషతో 2021లో వివాహం జరిగింది. వారికి కుమారుడున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగు తున్నాయి. రెండు నెలల కిందట భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమె కాపు రానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన వెంకటేశ్ ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున తండ్రి ఇంటికి వచ్చి చూడగా వెంకటేశ్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

భద్రాచలంఅర్బన్: ఆర్థిక ఇబ్బందు లు తాళలేక పట్టణంలోని జగదీశ్‌కాలనీకి చెందిన కొత్తపల్లి రామకృష్ణ (28) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కారుడ్రైవర్‌గా పనిచేస్తున్న రామకృష్ణకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో..

దుమ్ముగూడెం: మండలంలోని డి.కొత్తూరు గ్రామానికి చెందిన దొబ్బిడి సీతయ్య (40) ఆదివారం రాత్రి మద్యం మత్తులో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సోమవారం ఎస్‌ఐ కేశవరావు కేసు నమోదు చేశారు. నిత్యం మద్యం తాగుతూ కుటుంబసభ్యులను సీతయ్య అకారణంగా దూషిస్తూ కొడుతుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సైతం మద్యం సేవించి కుటుంబసభ్యులను దూషించాడు. ఇంట్లోకి రమ్మని వాళ్లు గట్టిగా మందలించగా రాకుండా పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ తెలిపారు.

కేసు నమోదు

ఇల్లెందు: అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని కాకతీయనగర్‌కు చెందిన షైమున్నీసాకు అబ్బాస్‌తో 2021లో వివాహమైంది. నాటి నుంచి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సైదారవూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





































ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్య్ర దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్య్ర ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్య్ర పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్య్ర పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్య్రంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్య్ర మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్య్రం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు. శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్య్ర దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఴల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఴల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది.

ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఴల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్య్రం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకు రావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్య్రాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్య్ర భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చినవారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్య్ర దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్య్ర సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్య్రాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్య్ర దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు


సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటార్హైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటార్హైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటార్హైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటార్హైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం. సూడోమోనాస్, బవేరియా, మెటార్హైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100-120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటార్హైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సాగుబడి

అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చి గడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చి గడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముమ్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).

క్లుప్తంగా...

కృష్ణా జలాలపై నవంబర్ 29న విచారణ

సాక్షి, న్యూఢిల్లీ : కృష్ణా నదీ జలాల కేటాయింపులపై నవంబర్ 29 సుప్రీం కోర్టు విచారణ జరపనుంది. నదీ పరీవాహక ప్రాంతాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర మధ్య కృష్ణా ట్రిబ్యునల్ నీటి పంపకాలు జరుపుతూ 2010లో తుది అవార్డు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కర్ణాటక సుప్రీం కోర్టులో అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్లికేషన్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ దీపాంకర్ దత్తలతో కూడిన ధర్మాసనం ముందు కర్ణాటక తరపు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ సోమవారం ప్రస్తావించారు. రూ.వేల కోట్లతో కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తిగా వచ్చాయని శ్యామ్ దివాన్ తెలిపారు. ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం రాష్ట్రానికి కేటాయించిన జలాల మేరకు విడుదల చేయాలన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా విచారణ వేగవంతం చేయాలని, సముద్రంలోకి వృథాగా నీరు వెళ్లకుండా చూడాలని కోరారు. తొలుత నవంబర్ 21న విచారిస్తామన్న ధర్మాసనం తుది విచారణ నిమిత్తం నవంబర్ 29న విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రార్‌ని ఆదేశించింది.

చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

చార్మినర్ ఎక్స్‌ప్రెస్‌లోనూ దోపిడీకి యత్నం

ఉలవపాడు: అర్ధరాత్రి వేళ.. అందరూ నిద్రలో ఉన్నారు.. అంతలో ఒక్కసారిగా రైల్లో కలకలం.. బోగీలోకి ఎక్కిన దొంగలు ప్రయాణికులను బెదిరించి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు తీసుకుని చైన్ లాగి దర్జాగా రైలు దిగి వెళ్లిపోయారు. చాగల్లు–తెట్టు మధ్య హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రాత్రి గం .1.50 సమయంలో నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం రాజుపాలెం (చాగల్లు–తెట్టు) వద్ద దొంగలు చైన్ లాగడంతో రైలు నిలిచింది. దొంగలు ప్రయాణికులను బెదిరించి వారి నుంచి నగలు అపహరించి రైలు దిగారు. అనంతరం హైదరాబాద్ నుంచి తాంబరం వెళుతున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ 2.30గం.ల. సమయంలో సిగ్నల్ వద్ద నిలిచిపోయింది. అక్కడే ఉన్న దొంగలు అక్కడే ఉండి ప్రయాణికులను బెదిరించి దోపిడీ చేసేందుకు యత్నించారు. కానీ రైల్వే పోలీసులు టార్చ్‌లైట్లు వేసి వారిని చూడాలని ప్రయత్నించడంతో రైలుపై రాళ్లు రువ్వారు. దీంతో ఆటోలో దొంగలు పారిపోయారు. ఈ రెండు ఘటనలు 40 నిమిషాల వ్యవధిలో జరిగాయి. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో మొత్తం మూడు బోగీలలో కలిపి 111 గ్రాముల బంగారం దోపిడీ జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మారణహోమానికే టీడీపీ నేతల దాడి

ముందస్తు ప్రణాళికతోనే అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం

- ఓ మార్గంలో అనుమతి తీసుకుని చంద్రబాబు మరో మార్గంలో వచ్చారు
- చంద్రబాబు స్వయంగా వేసేయండిరా అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారు
- అడ్డుకొన్న పోలీసులపైనా దాడి చేశారు.. 47 మంది పోలీసులు గాయపడ్డారు
- ఈ ఘటనతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తాం
- ఇలాంటి ఘటనలను, బాధ్యులను కోర్టులు ఉపేక్షించకూడదు
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి
- విచారణ బుధవారానికి వాయిదా • అప్పటి వరకు పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని ఏఏజీకి న్యాయమూర్తి మౌఖిక ఆదేశాలు



సాక్షి, అమరావతి : మారణహోమం సృష్టించాలన్న ముందస్తు పక్కా ప్రణాళికతోనే అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. అందులో భాగంగానే పోలీసులకు కూడా చెప్పకుండా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయాణ మార్గాన్ని కూడా మార్చారని వివరించారు. పోలీసుల నుంచి ఓ మార్గానికి అనుమతి తీసుకుని, మరో మార్గంలో రావడం వెనుక కుట్ర ఉందన్నారు. టీడీపీ అగ్ర నేతల ఆదేశాలతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అధికార పార్టీ కార్యకర్తలపై దాడులు చేశారని, అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం సృష్టించారని తెలిపారు. అడ్డుకోబోయిన పోలీసులపైనా విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. టీడీపీ దాడిలో దాదాపు 47 మంది పోలీసులు గాయపడి చికిత్స పొందుతున్నారని, ఓ పోలీసు ఏకంగా కంటి చూపు కోల్పోయారని వివరించారు. అధికార పార్టీ కార్యకర్తలను చూడగానే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 'వాళ్లను తరమండిరా, వేసేయండిరా..'అంటూ టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పారన్నారు. ఆయన ఆదేశాలతోనే వారు విధ్వంసం సృష్టించారన్నారు. పోలీసులు రాకుండా ఉంటే వారి చేతిలో పలువురు చనిపోయి ఉండేవారని వివరించారు. కార్యకర్తలను రెచ్చగొట్టినందుకే చంద్రబాబు, ఇతర నేతలపై హత్యాయత్నం కేసు కూడా నమోదు చేశామన్నారు. 'యుద్ధభేరి'పేరుతో ప్రాజెక్టుల సందర్శన కోసం వచ్చి అంగళ్లు నుంచి పుంగనూరు వరకు యుద్ధ వాతావరణం సృష్టించారని, వారు చేయాలనుకున్నది చేసి చూపారని చెప్పారు. ఇలాంటి ఘటనలను, ఇందుకు బాధ్యులైన వారిని న్యాయస్థానాలు ఉపేక్షించకూడదని కోరారు. అంగళ్లు వద్ద టీడీపీ దాడులపై చంద్రబాబు సహా పలువురు టీడీపీ నేతలపై ముదివీడు పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ సీనియర్ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, పులివర్తి నాని వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం విచారణ జరిపారు.

ఉపయోగపడే ప్రాజెక్టును అడ్డుకోవద్దని కోరితే చంపేస్తారా?

ఈ సందర్భంగా ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పలు గ్రామాల ప్రజలకు అత్యంత ఉపయుక్తమైన పిచ్చివాండ్లపల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు కొందరు టీడీపీ నేతలు హైకోర్టులో స్టే తెచ్చారని, దీనిపై నిరసన తెలిపి, చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు స్థానిక అధికార పార్టీ నేతలు అంగళ్లు వద్ద శిబిరం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అక్కడి రాగానే అధికార పార్టీ నేతలను చూసిన చంద్రబాబు ఆగ్రహంతో ఊగిపోతూ, వారిని తరమండి, కొట్టండి, వేసేయండి అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారని వివరించారు. అక్కడి నుంచి విధ్వంసం మొదలైందన్నారు. మొదటి ముద్దాయి చంద్రబాబును ఎందుకు అరెస్ట్ చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించగా.. విధ్వంసంతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తామని సుధాకర్‌రెడ్డి చెప్పారు. పిటిషనర్ ఉమా సైతం అధికార పార్టీ నేతలను బెదిరించేలా వారి వైపు వేలు చూపుతూ వారిని కొట్టండంటూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టారన్నారు. ప్రతిపక్ష నేతలు వస్తున్నారని తెలిసీ, అధికార పార్టీ నేతలు అక్కడికి ఎందుకు వెళ్లారని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రజలకు ఉపయుక్తమైన ప్రాజెక్టును అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేయడానికే వెళ్లారని, వినతి పత్రం ఇవ్వడానికి సిద్ధమైనంత మాత్రానా చంపేస్తారా అంటూ సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు.

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు

అంతకు ముందు దేవినేని ఉమా తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదుదారు ఉమాపతిరెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఉమాపై ఎలాంటి ప్రత్యక్ష ఆరోపణలు లేవని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు నమోదు చేశారన్నారు. మరింత మంది నేతలను ఇరికించేందుకే కేసు నమోదులో జాప్యం చేశారన్నారు. నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది ఎస్‌వీ సుమంత్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు లేవని, ఉద్దేశపూర్వకంగానే కేసు నమోదు చేశారని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి ఏఏజీ అభ్యర్థన మేరకు విచారణను బుధవారానికి వాయిదా వేశారు. అప్పటి వరకు పిటిషనర్లను అరెస్ట్ చేయవద్దని, ఆ మేర పోలీసులకు సూచన చేయాలని సుధాకర్‌రెడ్డికి న్యాయమూర్తి మౌఖికంగా చెప్పారు.



జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం జస్టిస్ భుయాన్ హుండీలో కానుకలు సమర్పించారు. వీరికి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. కరుణాకర్‌రెడ్డి శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించారు.

భక్తుల రక్షణే ప్రధాన ధ్యేయం

- అటవీశాఖ సిబ్బందితో ప్రత్యేక భద్రత
- రక్షణ కోసం భక్తులకు చేతికర్ర అందిస్తాం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి



తిరుపతి సిటీ: తిరుమల వచ్చే శ్రీవారి భక్తుల ప్రాణ రక్షణే తమ ప్రధాన ధ్యేయమని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో మీడియాతో మాడుతూ.. చిరుత దాడిలో గతంలో కౌషిక్ గాయపడటం, ఇటీవల చిన్నారి లక్షిత ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీటీడీ అప్రమత్తమై అటవీ శాఖ అధికారులు, పోలీసులతో కలసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో 12 ఏళ్ల వయసు లోపు పిల్లలతో వచ్చే భక్తులకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పెద్దలను మాత్రం రాత్రి 10 వరకు అనుమతిస్తామని తెలిపారు. నడక దారిలో వెళ్లే ప్రతి భక్తునికి సహకారం కోసం ఊత కర్ర అందిస్తామన్నారు. ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలను ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. భక్తులను గుంపులుగా వెళ్లేందుకు అనుమతిస్తూ.. ముందు వెనుక అటవీశాఖ సెక్యూరిటీతో భద్రత కల్పిస్తామన్నారు.. అటవీశాఖ అధికారులు నిపుణులైన భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని సూచించామని.. వారి వేతనాలు టీటీడీయే భరిస్తుందన్నారు.

జంతువులకు ఆహారం అందించడం నిషేధం

నడక దారిలో వెళ్లే భక్తులు సాధు జంతువులకు ఆహారం అందించడం నిషేధించామని, అలా అందించే వారిపై చర్యలు తప్పవని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నడక దారి లోని దుకాణదారులు, హోటళ్ల యజమానులు వ్యర్థాలను బయట వేయరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తిరుపతి నుంచి తిరుమల వరకు నడకమార్గంలో సుమారు 500 కెమెరాలను అమర్చనున్నామని, అవసరమైతే డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొన్నారు. వైల్డ్‌లైఫ్ అవుట్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని, డాక్టర్లు సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దారి పొడవునా సుమారు 30 అడుగుల వరకు వెలుతురు ఉండేలా ఫోకస్ లైట్లు అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలిపిరి భూదేవి కాంప్లెక్స్, శ్రీవారి మెట్టు వద్ద 15వేల దివ్య దర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామని, మధ్యలో వీటిని తనిఖీ చేయాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టోకెన్లు పొందిన భక్తులు రోడ్డు మార్గాన సైతం వెళ్లేందుకు అనుమతిస్తామని తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటుపై అటవీ అధికారులతో చర్చించామని.. కేంద్ర అటవీశాఖ ఉన్నత స్థాయి కమిటీ వేసి అధ్యయం చేసిన తర్వాత నిర్ణయం ఉంటుందన్నారు.

చిక్కిన చిరుత

శేషాచలం అడవుల్లో టీటీడీ అటవీ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన బోనులో సోమవారం తెల్లవారుజామున చిరుత చిక్కుకుంది. నెల్లూరు జిల్లాకు చెందిన లక్షిత(6) అనే బాలికపై వన్యమృగం బలి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వన్యమృగం దాడికి పాల్పడిన శేషాచల అటవీ ప్రాంతంలోని అలిపిరి–తిరుమల నడక మార్గంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఘంటా మండపం మధ్య మూడు బోన్లను ఉంచారు. సోమవారం వేకువజామున ఒక బోనులో మగ చిరుత చిక్కింది. ఆ చిరుత వయసు ఐదేళ్లకు పైగా ఉంటుందని అటవీ అధికారులు నిర్ధారించారు.

కేసీఆర్ హటావో..తెలంగాణ బచావో..బీజేపీకి జితావో

- ఈనెల 16 నుంచి సెప్టెంబర్ వరకు మూడు విడతల్లో ఉద్యమ కార్యక్రమాలు
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ పాలన పోవాలంటే మరో ఉద్యమం ప్రారంభం కావాల్సిందేనని, ఆయన్ను గద్దె దించేందుకు బీజేపీ మరో ఉద్యమానికి సిద్ధమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్ హటావో – తెలంగాణ బచావో– బీజేపీకి జితావో' నినాదంతో పోరాటం ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఇందు కోసం మూడు విడతలుగా బీజేపీ ఉద్యమ కార్యక్రమాలు సిద్ధం చేసిందన్నారు. ఆగస్టు 16 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యాచరణ సెప్టెంబర్ వరకు సాగుతుందని తెలిపారు.

- మొదటి విడత కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 16న పల్లెబాట, బస్తీబాట, 17న బాధితులు, దరఖాస్తుదారులతో మండల, డివిజన్ల వారీగా ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్టు చెప్పారు. ఆగస్టు 18న అసెంబ్లీ కేంద్రంగా ప్రధాన రహదారుల్లో రాస్తారోకో, ధర్నా, ముట్టడి అసెంబ్లీ కేంద్రాల్లో దిగ్బంధనం ఉంటుందన్నారు.
- రెండో విడత కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 23న అధికార పార్టీ ఎమ్మెల్యేల ఘెరావ్, 24న మంత్రుల ఘెరావ్ కార్యక్రమాలతోపాటు ఆగస్టు 27న జిల్లా కలెక్టర్ కార్యాలయ ముట్టడి, జైల్ భరో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
- మూడో విడత కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ మొదటివారంలో హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ చేపడుతున్నట్టు చెప్పారు.

జిల్లా వార్తలు

సీయూఈటీలో ఖమ్మం విద్యార్థిని ప్రతిభ

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలోని అన్ని విభాగాల్లో సీటు



వున్నవ రిషిక

ఖమ్మంసహకారనగర్: కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్టు (సీయూఈటీ)లో ఖమ్మానికి చెందిన విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. జిల్లా కేంద్రంలోని బుర్హాన్ పురానికి చెందిన వున్నవ రిషిక కేంద్రియ విద్యాలయంలో పదో తరగతి వరకు చదవగా, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. ఈ క్రమంలో సీయూఈటీ రాసిన ఆమె 541 మార్కులు సాధించగా.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (షిల్లాంగ్ క్యాంపస్)లోని అన్ని విభాగాల్లో సీటు సాధించింది. తెలంగాణ నుంచి అన్ని విభాగాల్లో సీటు సాధించిన ఏకైక విద్యార్థినిగా రిషిక గుర్తింపు సాధించింది. ఆమె ఈ విద్యా సంవత్సరం(2023–24) బీఏ హానర్స్ రీసెర్చ్ ఇంగ్లిష్ కోర్సు అభ్యసించాలని నిర్ణయించుకుంది. కాగా, రిషిక తండ్రి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడైన కిరణ్‌కుమార్ కరోనా సమయంలో కన్నుమూశాడు. ఐక్యరాజ్య సమితిలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యంగా రిషిక చెబుతోంది.

అక్రమాల గుట్టు విప్పేనా..?

- జేకే ఓసీ నిర్వాసిత జాబితాపై విచారణ మరూ
- 'సాక్షి' వరుస కథనాలతో స్పందన
- రంగంలోకి టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ బృందాలు



నిర్వాసిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఇల్లెందురూరల్: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ నిర్వాసిత జాబితాలో చోటుచేసుకున్న అక్రమాలు, అటవీ భూభాగంపై స్పష్టత ఇచ్చేందుకు అటవీ శాఖ సమగ్ర విచారణకు సిద్ధమైంది. జేకే ఓసీ నిర్వాసిత ప్రాంత వ్యవహారంలో ప్రాథమిక స్థాయి నుంచి జాబితాలో అదనపు పేర్లు, క్రయ విక్రయాలకు సంబంధించి 'సాక్షి'లో వచ్చిన విశ్లేషణాత్మక వరుస కథనాలకు స్పందించిన అటవీ అధికారులు విచారణ నిర్వహించి బీట్ అధికారి చందులాల్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే విచారణ తీరులో ఉన్న లోపాలను విశ్లేషిస్తూ 'బీట్ ఆఫీసర్‌పై వేటుతో సరిపెడతారా..? ' శీర్షికతో ఈనెల 13న మరోసారి కథనం ప్రచురితం కావడంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు మళ్లీ స్పందించారు. జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో వాస్తవంగా ఏం జరిగింది.. అటవీ, రెవెన్యూ భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి.. జాబితాలో పేర్లు ఎలా పెరిగాయి.. పూర్తి ప్రక్రియలో తప్పిదం ఎక్కడ చోటుచేసుకుంది.. అందుకు బాధ్యులెవరు.. వంటి అంశాలపై అటవీ శాఖ దృష్టి సారించింది. ఇందుకోసం జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం, రాష్ట్ర స్థాయి నుంచి విజిలెన్స్ బృందం సోమవారం రంగంలోకి దిగాయి. ముందుగా వచ్చిన టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్‌ఓ బీ.వీ.ఎస్.కే.ప్రసాద్, ఎఫ్ఎస్ఓ కోటేశ్వరరావు, ఎఫ్‌బీఓ రాము తదితరులు నిర్వాసిత ప్రాంతాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. విజిలెన్స్ అధికారులు ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి సంబంధిత దస్త్రాలను ముందుగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యటించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒకే అంశంపై టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ బృందాలు విచారణకు రావడంతో అటవీశాఖలో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. మరి ఈ రెండు విచారణ బృందాలు జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో వాస్తవంగా చోటుచేసుకున్న అక్రమాల గుట్టు విప్పుతాయా లేదా వేచిచూడాల్సిందే.

పంద్రాగస్టు ఘనంగా జరుపుకోవాలి

ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ



గిరిజన దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

భద్రాచలం: ఏజెన్సీలోని గిరిజన, గిరిజనేతరులందరూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఐటీడీఏ ఏపీఓ (జనరల్) డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వారు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత యూనిట్ అధికారులకు అందజేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి అర్హతల మేరకు పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందేవిధంగా చూడాలని పేర్కొన్నారు. అలాగే, మంగళవారం ఐటీడీఏలో జరిగే 77వ భారత స్వాతంత్ర్య దిన వేడుకలకు ఉద్యోగులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ ఏఓ భీమ్, అధికారులు సురేశ్‌బాబు, ఆర్.శ్రీనివాస్, రమణయ్య, అశోక్‌కుమార్, ప్రభాకర్‌రావు, మునీర్‌పాషా, ఆదినారాయణ, దుర్గయ్య, నాగభూషణం, నరేందర్, సుగుణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండా

ఏఐజీఈటీఓఏ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ వీరభద్రరావు



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరభద్రరావు

ఖమ్మంమయూరిసెంటర్: బీఎస్ఎన్ఎల్ సంస్థలోని ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ఆల్ ఇండియా గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్, టెలీకాం ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏఐజీఈటీఓఏ) పనిచేస్తోందని అసోసియేషన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ జి.వీరభద్రరావు వెల్లడించారు. ఖమ్మంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేశ్ అధ్యక్షతన సోమవారం జరగగా ఆయన మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ ఆఫీసర్ల మూడో సభ్యత్వం గుర్తింపులో భాగంగా వచ్చేనెల 12న ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ఎనిమిది సంఘాలు పాల్గొంటుండగా, ప్రస్తుతం అతి పెద్ద అసోసియేషన్‌గా గుర్తింపు పొందిన ఏఐజీఈటీఓఏను మళ్లీ అదే స్థాయిలో నిలపాలని కోరారు. ఉద్యోగుల సమస్యలే కాకుండా సంస్థ ఉన్నతి, అభివృద్ధికి తమ అసోసియేషన్ విశేషంగా కృషి చేస్తుందని గుర్తుచేశారు. సమావేశంలో అసోసియేషన్ సర్కిల్ అధ్యక్షుడు ఆర్.కరుణాకర్, బాధ్యులు బి.లక్ష్మణ్, ఎం.మాధవరావు, ఎస్.సురేశ్, టి.నరేందర్‌కుమార్, టి.గోవింద్, ఎస్‌వీ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల ఐక్యత చారిత్రక అవసరం



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కూనంనేని, పక్కన సీపీఐ, సీపీఎం నాయకులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

బోనకల్: కమ్యూనిస్టుల ఐక్యత ప్రస్తుతం చారిత్రక అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో సోమవారం తమ్మారపు వెంకట కోటయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడళ్లలో పార్టీ పతాకాలను సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ.. భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో గోవిందాపురం(ఎల్) గ్రామం కీలక భూమిక పోషించిందని గుర్తుచేశారు. మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా పోరాటవీరుల స్మారక స్తూపాలు కనిపిస్తాయని తెలిపారు. కడవరకు కమ్యూనిస్టుగా జీవించిన తమ్మారపు వెంకటకోటయ్య ధన్యజీవి అని కొనియాడారు. కాగా, కేంద్రంలోని మోదీ పాలనలో దేశం క్లిష్ట పరిస్థితుల్లో కూరుకుపోయి పేదలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యాన ప్రజాసమస్యలపై జరిగే పోరాటాలతో పాటు ఎన్నికల్లోనూ వామపక్షాలు ఐక్యంగా ఉంటే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, నాయకులు పాలడుగు భాస్కర్, తాటి వెంకటేశ్వర్లు, ఏపూరి రవీంద్రబాబు, బెజవాడ రవి, తోటపర్తి గోవిందరావు, మందడపు రాణి, యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు సారొచ్చేనా ?

- నేడు ప్రకాశం స్టేడియంలో స్వాతంత్ర్య వేడుకలు
- సింగరేణి సీఎండీ రాక కోసం ఎదురుచూపులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మంగళవారం నిర్వహించే స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు వేడుకలకు సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ వస్తారా, రారా అని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే సీఎండీ వస్తారంటూ ఆయన కార్యాలయాన్ని మాత్రం ముస్తాబు చేస్తున్నారు. మరి సారొస్తారా.. ముస్తాబుకు పెట్టే ఖర్చు వృథా అవుతుందా అనే సందేహం కార్మికుల్లో నెలకొంది. సింగరేణి సీఎండీగా 2105లో బాధ్యతలు చేపట్టిన శ్రీధర్.. తొలి రోజుల్లో ఒకసారి వచ్చి సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని, జీకేఓసీలో పనులను పరిశీలించారు. ఆ తర్వాత 2019లో సింగరేణి డే వేడుకలకు హాజరైనా ప్రధాన కార్యాలయానికి రాలేదు. గతేడాది వరదల సమయంలో భద్రాచలానికి ప్రత్యేకాధికారిగా వచ్చినా సింగరేణి కార్యాలయం వైపు కన్నెతి కూడా చూడలేదు. ప్రతీ సారి పెద్ద సారు వస్తారంటూ ఆయన కార్యాలయాన్ని రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయడం, ఆ తర్వాత తాళం వేయడంతో ఆ నిధులు వృథా అవుతున్నాయని కార్మికులు అంటున్నారు. గతంలో పనిచేసిన సీఎండీలు ఏడాదికి కనీసం రెండు, మూడు సార్లయినా వచ్చి తనిఖీలు చేసేవారని, ప్రస్తుత సీఎండీ మాత్రం ఇటు వైపు రావడమే మానేశారని ఆరోపిస్తున్నారు. సింగరేణి సంస్థకు తండ్రిలా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారి.. ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 70 మంది కార్మికులు గని ప్రమాదాల్లో మృతిచెందితే కనీసం ఒక్క కుటుంబాన్ని కూడా పరామర్శించిన దాఖలాలు లేవని ఆవేదన చెందుతున్నారు.

మూడు నెలలకోసారైనా రావాలి..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని మూడు రీజియన్లలో కనీసం మూడు నెలలకు ఓసారైనా సీఎండీ సందర్శించాలని కార్మికులు కోరుతున్నారు. తద్వారా అధికారులు అప్రమత్తమై కిందిస్థాయి ఉద్యోగులను అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందంటున్నారు. ఈక్రమంలోనే పెండింగ్ పనులు కూడా పూర్తవుతాయని చెబుతున్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో 40విభాగాలు ఉండగా దాదాపు సగం అలంకార ప్రాయంగానే ఉన్నాయనే ఆరోపణలున్నాయి. కొందరు అధికారులు, ఉద్యోగులు మస్టర్లు వేసుకొని వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గనుల వద్ద కూడా కొందరు యూనియన్ నాయకులూ అలాగే చేస్తున్నారని, వారిని ప్రశ్నించే నాథుడే లేడని అంటున్నారు. విజిలెన్స్, ఆడిట్, క్వాలిటీ విభాగాల వారు తనిఖీలు మరిచిపోయారని, సీఎండీ అప్పుడప్పుడూ వస్తే ఇలాంటివన్నీ చక్కబడుతాయని కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఎంపిక పోటీలకు రెండు జిల్లాల నుంచి 40 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసుదేవ్, ఎస్‌కే ముబీన్, రాకేశ్, జె.వినయ్‌కుమార్, బి.పవన్‌కుమార్, కె.సాయిరాం, ఇషాక్, బి.గోపీచంద్, విల్సన్, ఎలీషానాయక్, పి.శివ, శరత్, నోమేల్ జాక్సన్, అక్షిత్, జేమ్స్, చంద్రశేఖర్, సంతోష్, యశ్వంత్, అబాబు బక్కర్, వి.కల్యాణ్‌తో జట్టును ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే, స్టాండ్‌బైగా గోపీనాథ్, సీహెచ్ శివ, అఖిలేశ్, కె.సునీల్, చక్రిని ఎంపిక చేశామని చెప్పారు. ఈ జట్టు ఈ నెల 16 నుంచి వనపర్తి జిల్లా పెబ్బేరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ ఎండీ గౌస్, అక్తర్, రమణ, శ్రీను, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్ కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.